

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**ముకుందం చేతి వ్రాత** ఎంతో అందంగా ఉంటుంది. ఆ రోజు వాణి ముకుందాన్ని అడిగింది కొన్ని కాగితాలు పుస్తకం ఇచ్చి "వీటిని ఈ పుస్తకంలో నీట్‌గా ఫెయిర్ చేసి పెడతారా?"

"ఏమిటిది?" అడిగాడు అతను ఆ కాగితాలను తిరగేస్తూ.

"వచ్చేనెల పదహారున మా అమ్మా నాన్నల మేరేజ్ ఏనివర్సరీ, వాళ్ళకి గిఫ్ట్‌గా ఈ బుక్ పంపుదామని."

ఆ కాగితాల్లో ఏ పేజీలో ఏది రాయాలో నంబర్లిచ్చింది పుస్తకం తయారయితే ఎలా ఉంటుందో అర్థం చేసుకున్న ముకుందం చెప్పాడు మెచ్చుకోలుగా "ఇది ఎంతో గొప్ప సెంటిమెంటల్ గిఫ్టు అవుతుంది."

"అమెరికన్స్‌లో ప్రాక్టికాలిటీ ఎక్కువ. ఎక్కడ అది ఉంటుందో అక్కడ సెంటిమెంట్‌కి చోటుండదు. అమెరికాలో తల్లీ పిల్లల మధ్య సంబంధాలు పన్నెండు పధ్నాలుగేళ్ళ తర్వాత ఇక్కడలా సెంటిమెంటల్‌గా కాక, ఆర్థికపరంగా మారుతాయి. సో, అవకాశం ఉన్నప్పుడల్లా సెంటిమెంటల్‌గా ఉండే గిఫ్ట్‌లు బహుమతులుగా ఇవ్వడానికి అటు తల్లితండ్రులు కాని, ఇటు పిల్లలు కాని ఇష్టపడతారు. ఏ.టి. అండ్ టి అనేది అమెరికాలోని టెలిఫోన్ కంపెనీ పేరు. వాళ్ళు ఓ ప్రకటన తయారుచేశారు. టెలిఫోన్ పక్కన కూర్చుని ఏడుస్తున్న దయనీయంగా కనిపించే ఓ ముసలావిడ ఫోటో, దాని కింద 'డిడ్ యు కాల్ యువర్ మమ్ టు డే?" అన్న కేప్షన్. దూరంగా ఉన్న తమ తల్లికి ఫోన్ చేసి ఎంతకాలం అయిందో గుర్తు చేయాల్సిన బాధ్యతను ఏ.టి.అండ్ టి తీసుకుందంటే వాళ్ళ మధ్య ఆప్యాయతలు, ప్రేమలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించుకోవచ్చు. ఆ ప్రకటన వెలువడ్డాక కొన్ని లక్షలమంది తల్లితండ్రులకి ఫోన్ చేశారు. అలాంటి మనుషుల మధ్య పెరిగిన నాకు సెంటిమెంట్స్ అంటే ఎంతో ఇష్టం. అందుకే ఇది."

ముకుందం రెండురోజులు కష్టపడి ఆ పుస్తకంలోని ప్రతి పేజీనీ అందంగా అలంకరించాడు.

మొదటి పేజీలోని ఇంగ్లీష్ కొటేషన్ ఎంతో హృద్యంగా ఉంది.

MANY WONDERFUL THINGS COME IN HUNDREDS.

STARS, SEAS, FLOWERS, COLOURS, RIVERS AND SO ON….

EXPECT MOTHER AND FATHER WHO ARE SINGULAR.

(అద్భుతమైన వస్తువులన్నీ వందల్లో వస్తాయి. నక్షత్రాలు, సముద్రాలు, పుష్పాలు, రంగులు, నదులు మొదలయినవి. ఒక్క తల్లి తండ్రి తప్ప)

దానికింద పద్దెనిమిదవ మేరేజ్ ఏనివర్సరీ సందర్భంగా ఆ పుస్తకం బహూకరిస్తున్నట్లుగా రాశాడు. వాణి సంతకానికి చోటు వదిలాడు.

తర్వాత పేజీలో ఆమె తల్లితండ్రుల పేర్లు, పుట్టినరోజులు, పుట్టిన ఇళ్ళ ఫొటోలు (తల్లితండ్రులిద్దరూ ఇళ్ళల్లో మంత్రసాని సహాయంతో పుట్టారు) వయసు, తండ్రి ఏ వయసులో ఏం సాధించాడు, ఎసెసెల్సీ నుంచి ప్రస్తుతం పనిచేసే ఉద్యోగం దాకా వివరాలు, తల్లి ఏ వయసులో చదువు ఆపింది, వివాహం, అమెరికా వలస వెళ్ళిన రోజు పిల్లలు పుట్టిన రోజులు మొదలయిన వివరాలు, తల్లిదండ్రులమీద చక్కటి కొటేషన్స్. తన తండ్రిమీద తాతయ్య అభిప్రాయం మొదలైనవి ఆ పుస్తకంలో చోటు చేసుకున్నాయి.

పదహారు పేజీల ఆ పుస్తకం తయారయ్యాక ముకుందం వాణికిచ్చాడు. మొత్తం చూసిన వాణికి ఎంతో నచ్చిందది.

"థాంక్స్ యు హేవ్ డన్ ఏన్ ఎక్సలెంట్ జాబ్. ఐ మీన్.... బాగా రాశారు. ఐ ఓ యు ఏ ట్రీట్. దీని మీద సెంట్ రాసి రిజిస్టర్డ్ పోస్టులో పంపుతాను." చెప్పింది.

కొత్తగా వాణితో పరిచయం అయినవారికి ఆమె ప్రవర్తన నిర్లక్ష్యంగా, ఎదుటివాళ్ళు ఏం అనుకుంటారో అన్న ఇంగితం లేనట్లుగా అనిపిస్తుంది. ఆమె అన్ని విషయాల్లో నిర్మొహంటంగా ఉండటం వల్ల అలా అనిపిస్తుంది. కానీ ఆమెతో ఎక్కువకాలం పరిచయం ఉన్నవాళ్ళకి మాత్రమే ఆమె చాలా సెంటిమెంటల్ అని, సున్నిత మనస్కురాలని తెలుస్తుంది.

ముకుందానికి ఆమె స్వభావం అర్థం చేసుకోగలగడానికి కారణం వాళ్ళ పరిచయం వయసు ఎనిమిది నెలలు దాటడం వల్లే.

అయితే ముకుందం తన మనసులోని మాటను వాణికి వెల్లడించలేదు. ఆమె మనసులో ఏం ఉందో ముందుగా తెలుసుకోవాలనుకున్నాడు.

నెల్లో నాలుగురోజులు వాణి తమింటికి రాకపోవడం ముకుందానికి అలవాటైంది. ఆమెని చూడాలని ఆ నాలుగురోజులూ ముకుందానికి మనసు కొట్టుకుపోయేది. కానీ వాళ్ళ ఊరు వెళ్ళి ఆమెని చూడటానికి శివయ్యకి చెప్పడానికి సరయిన కారణం తట్టేదికాదు. దాంతో వెళ్ళేవాడు కాదు.

ముకుందం, వాణి సాయంత్రాలు చదరంగం ఆడుతుండగా, క్రికెట్ ఆటకి వెళుతూ, తీసుకెళ్ళడానికి వాళ్ళింటికి వస్తూండేవాడు బాపన్న. అతను ముకుందానికి హైస్కూలు నుంచి క్లాస్‌మేట్, బెస్ట్ ఫ్రెండ్

"ఎవర్రా ఆ అమ్మాయి?" అడిగాడు బాపన్న వాణిని చూసిన మొదటిరోజు.

"మా ఫేమిలీ ఫ్రెండ్"

"భలే ఉందిరా? ఏదయినా వ్యవహారం మొదలెట్టావా?"

"ఛ. లేదు"

"నాకు నచ్చింది."

"ఇడియట్ ఇంకోసారి ఆ అమ్మాయి గురించి అలా మాట్లాడకు."

"ఏం?"

"నాకూ నచ్చింది."

"ఓహో. సరే అయితే."

"ఇకనించి వాణి నీ చెల్లెల్లాంటిది."

"అంతేనంటావా?"

"అంతే."

"ఇంకోసారి ఆలోచించుకోరా?"

"ముమ్మాటికీ వాణి నీ చెల్లెలే. అలా అయితేనే మన స్నేహం నిలుస్తుంది." హెచ్చరించాడు ముకుందం.

"సరే అయితే అన్నాగా"

బాపన్న వయసు కూడా ముకుందం వయసే. అయితే గత ఏడాదిగా బాపన్నకి సెక్స్ అనే చర్య ఎలా ఉంటుందో తెలుసుకోవాలని కోరికగా ఉంది. ఆ సంగతి ముకుందంతో అనేకసార్లు చర్చించాడు కూడా. అయితే ఇంతదాకా బాపన్న కోరిక తీరలేదు.

"నువ్వే అన్నావు కదరా, వేశ్యల జోలికి వెళితే ఎయిడ్స్ అంటుకుంటుందని ఎవరయినా ఫేమిలీ అమ్మాయిని చూసుకోమని?" చెప్పాడు బాపన్న కాసేపాగి.

ముకుందం బాపన్న కాలర్ పట్టుకుని గట్టిగా లాగి చెప్పాడు.

"మీ నళిని ఆంటీ, మీ అక్క కూతురు, మీ ఎదురింటి అమ్మాయితో ప్రయత్నం చెయ్యి. పిచ్చి పిచ్చి ఆలోచనలు చేస్తే జాగ్రత్త."

"అంతేనంటావా?"

"అంతే."

"సరే అయితే. ఈ క్షణం నుంచి వాణి నాకు చెల్లెలు. కానీ వాణిలో నాకు చెల్లెలి సంబంధం కనబడటంలేదు. అయినా నాకు వాణి చెల్లెలే ఇకనించి"

"మీ అమ్మ మీద ఒట్టు?"

"మా అమ్మా, నాన్నల మీద ఒట్టు. నాకు స్నేహం ముఖ్యం తప్ప ప్రేమకాదు."

"ఏడ్చావులే. పెళ్ళంటూ చేసుకుంటే వాణినే చేసుకుంటాను నేను. లేదా బ్రహ్మచారిగా ఉండిపోతాను నాకు చదరంగం పరమబోరు. వాణికోసం భరిస్తున్నాను."

"చాలా ఎత్తుల్లో ఓడిపోతున్నావ్. నీకన్నా వాణి తెలివిగలదా?"

"అవును. అమెరికాలో పుట్టి పెరిగింది కదా! గ్రామంలోని వాళ్ళకంటే సిటీలోని వాళ్ళు తెలివిగల వాళ్ళయి ఉంటారు. అలాగే ఇండియాకన్నా అమెరికాలోని వాళ్ళు తెలివిగల వాళ్ళయి ఉంటారు."

"ఎవడా మాటన్నది?"

"వాణీనే"

"ఏడ్చింది"

"ఏమిటా పిచ్చివాగుడు? నీ చెల్లెలి గురించి మాట్లాడే మాటలేనా అవి?" మందలించాడు ముకుందం.

"నా చెల్లెలు కాబట్టే నాకా హక్కుంది. ఇంకా మన ఇండియా గురించి ఏమంటుంది?"

"ఇండియా ఓ పెద్ద కుగ్రామంట"

"ఓసినీ!"

"అలా మాట్లాడితే ఇంక చెప్పను"

"అది సరేకాని, మరి నీ మనసులో మాట వాణికి చెప్పావా?"

"ఊహూ"

"ఏం?"

"ముందు ఆ అమ్మాయి మనసులో ఏ ఉందో తెలుసుకోవాలిగా? ఒరేయ్ బాపన్నా, నేను వాణి లేకుండా జీవించలేనురా. ఇది నిజం. ఆమెను ఎవరన్నా ఏమన్నా అంటే భరించలేను."

బాపన్న చిన్నగా నవ్వాడు.

"సర్లే. ఆలోచిద్దాంలే. నిన్న నళినీ ఆంటీకి రెంట్ కార్నర్‌నించి ఓ తెలుగు నవల తీసుకెళ్ళి ఇచ్చాను. పేరు సరస్వతి నమస్తుభ్యం కాని లోపల స్టఫ్ మాత్రం హాట్ హాట్."

ఆ వయసులో ఉండే కుర్రాళ్ళకది మామూలే. పక్కింటి ముప్పై ఐదేళ్ళ ఆంటీ గురించి కలలు కనే వయసులో ఉన్నాడు బాపన్న. అలాంటి నవల చదివి, ఉత్తేజితురాలై తనని పక్క మీదకి పిలుస్తుందన్నది అతని కల. ఆమెకు భర్త, సంసారం ఉన్నాయని, తనకి శీలం ముఖ్యమనుకుంటుందని. తన కోరికలు తీర్చడానికి భర్త ఉన్నాడన్న సంగతి అలాంటి కలలు కనేవారికి గుర్తుండదు.

"పుస్తకాలెందుకు? డైరెక్టుగా అడిగేయవచ్చుగా?

"నాకు భయం. మా అమ్మతో చెపితే?"

"చెయ్యిపట్టుకో"

"ఓసారి పట్టుకున్నా. చేతిని విదిలించి 'పోయిందా?' అని అడిగింది. ఏమిటని అడిగితే 'పురుగు' అన్నది. ఇంకేం చెయ్యను?"

"నీ కర్మ"

"ఏమయినా సరే. మెరక వీధికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను."

"పోలీసులు రెయిడ్ చేసి నిన్ను పట్టుకుని వీధిలో అర్థనగ్నంగా కట్ డ్రాయర్‌తో ఊరేగిస్తే కానీ నీ రోగం కుదరదు"

"అంతేనంటావా?"

"ముమ్మాటికీ అంతే"

వచ్చే ఆదివారం సైకిళ్ళ మీద ఎటయినా పిక్‌నిక్‌కి వెళ్ళాలనుకున్నారు. ఆ విషయం గురించి మాట్లాడుకోసాగారు ఆ తర్వాత.

వాణి స్కూలుకి సెలవులిచ్చారు. సెలవుల్లో వాణి రాజమండ్రి రావడం మానేసింది. ముకుందానికి రోజు రోజుకీ వాణిని చూడాలన్న కోరిక పెరుగుతూ వస్తోంది. కానీ ఇదివరకటి సమస్యే. ఆమె గ్రామంలోని వాళ్ళింటికి వెళితే, శివయ్యకి ఎందుకొచ్చాడని చెప్పాలి?

బాపన్నతో చర్చించాడు ముకుందం ఆ విషయం.

"ఐ లవ్ వాణి. అందుకని వచ్చానని చెప్పు." సలహా ఇచ్చాడు బాపన్న.

"తాట ఒలుస్తారు."

"వాళ్ళ దొడ్లో మొక్కలున్నాయా?"

"ఉన్నాయి."

"కరివేపాకు మొక్క కోసం వచ్చానని చెప్పు."

"కానీ మా ఇంట్లో కరివేపాకు చెట్టు వుందని వాణికి తెలుసు."

"గులాబి మొక్కకోసం వచ్చానని చెప్పు."

వెంటనే ముకుందం ముఖం వికసించింది.

"గుడ్ ఐడియా! మా అమ్మ గులాబి మొక్క తీసుకురమ్మని పంపిందని వెళతాను."

"నా చెల్లాయ్‌ని చూడాలని వుంది. నేనూ వస్తా. నా బస్ టిక్కెట్ కూడా నువ్వే కొనాలి" చెప్పాడు బాపన్న.

విజయదశమి రోజు ఇద్దరూ బస్సులో శివయ్య గ్రామం చేరుకున్నారు. బస్ దిగగానే కలరా హోటల్‌లోని అగ్గిరాముడు ముకుందాన్ని గుర్తుపట్టి పలకరించాడు.

"ఎలా ఉన్నారు సార్? మీకు ఆ డబ్బు ముట్టిందా?" అడిగాడు అగ్గిరాముడు.

"లేదే?"

"అదేమిటి? శివయ్యగారు నా ముక్కు పిండి వసూలు చేశారుగా?"

"మా నాన్నగారికి ఇచ్చి ఉంటారు. నాకు తెలీదు" చెప్పాడు ముకుందం.

"ఏం అనుకోకండి. ఆ రోజు అవసరం అలా తోసుకొచ్చి నా చేత ఆ పని చేయించింది. టీ తాగుదాం రండి."

"ఊహు. త్వరగా వెళ్ళాలి."

"నేనిస్తాలెండి డబ్బు."

"వద్దు."

ఇద్దరూ శివయ్య ఇంటివైపు నడుస్తూంటే అగ్గిరాముడు. ఆలోచనలో పడ్డాడు. వాళ్ళ దగ్గర పొగాకు పాయలకి డబ్బెలా సంపాదించాలా అని.

ఇద్దరూ శివయ్య ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో పాలేరు మాత్రం ఉన్నాడు.

"శివయ్యగారు లేరండి" చెప్పాడు అతను ముకుందాన్ని గుర్తుపట్టి.

"ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు ముకుందం.

"విజయవాడ వెళ్ళారు. దుర్గ కొండకి."

"వాణి?"

"వాణి. సంగీత ఇద్దరినీ తీసుకెళ్ళారు. అమెరికా పిల్లగా వాణికి దేవీ నవరాత్రులు ఉత్సవాలు చూపించడానికే వెళ్ళారంతా."

"మళ్ళీ ఎప్పుడొస్తారు?" అడిగాడు బాపన్న.

"రేపు మధ్యాహ్నానికి వస్తారు."

ముకుందం విచారంగా చూశాడు బాపన్న వంక.

"మొక్క?" గుర్తు చేశాడు బాపన్న.

"వెళ్ళొస్తాం."

ఇద్దరూ బయటికి వచ్చాక అడిగాడు బాపన్న.

"మొక్క అడగలేదే?"

"అడిగి తీసుకుంటే ఎల్లుండి మళ్ళీ రావడానికి ఇంకో మిష దొరకదు. బేడ్‌లక్."

ఇద్దరు మళ్ళీ బస్‌స్టాప్‌కి వచ్చేసరికి, కొద్ది నిముషాలకే బస్సు వచ్చింది. అదెక్కి రాజమండ్రి చేరుకున్నారు.

వాళ్ళు వెళ్ళిపోవడంతో అగ్గిరాముడు డిజప్పాయింట్ అయ్యాడు.

శివయ్య ఇంటికి మళ్ళీ మూడోరోజు వెళ్ళారు ఇద్దరూ.

"వాళ్ళింకా రాలేదెందుకో" పాలేరు చెప్పాడు.

"దెబ్బతిన్నాం" గొణిగాడు ముకుందం, బాపన్నతో.

"మొక్కడుగు."

"ఏమైనా పనుందా?" అడిగాడు పాలేరు.

"లేదు. మళ్ళీ వస్తాంలే"

రాజమండ్రిలో బస్సు దిగాక ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్ళారు. సినిమా అయాక ఇంటికి చేరుకున్నాడు ముకుందం. తన తల్లికి రెండు సార్లు వాణి ఇంటికి వెళ్ళిన సంగతి చెప్పాలా, చెప్పకూడదా అని ఆలోచించాడు.

కానీ చెప్పలేదు, సరయిన కారణం లేకపోవడంవల్ల.

వాణికి తన ప్రేమని ఎలా తెలియచేయాలా అని ఆలోచించసాగాడు.

ఉత్తరం రాయాలన్న ఆలోచన వచ్చింది ముకుందానికి.

6

*"వాణీ మై హనీ,*

ఎలా ఉన్నావ్? నిన్ను చూడాలని నాకెంతో కోరికగా వుంది. నిన్ను తాకాలని నాకింకా కోరికగా ఉంది. మెక్‌డొనాల్డ్స్‌లో బిగ్ మేక్‌ని ఇద్దరం చెరోవైపు నుంచి కొరుక్కుతినడం నేను ఎలా మరచిపోను? పేరడైజ్ డిస్కోలో నీవు, నేను డాన్స్ చేయడం నేను ఎలా మరిచిపోను?

సిల్క్‌లా మెత్తగా వుండే నీ బ్రౌన్ స్కిన్ మీది ప్రతిపుట్టుమచ్చా నాకు గుర్తే నేను చూసినంతవరకూ. ఎప్పుడెప్పుడు వస్తావా అని ఎదురుచూస్తున్నాను. నీతో చాలా మాట్లాడాలి, చెప్పాగా?

నాకు నేటివ్ అమెరికన్ అమ్మాయిలని పెళ్ళిచేసుకోవడం ఇష్టంలేదు. చేసుకున్నా మా అమ్మా నాన్నలలాగా విడాకులు తప్పవు. బ్లడీ హెల్. వాళ్ళు విడిపోయినపుడు నేను పడ్డ బాధ ఇంకా నాకు గుర్తుంది. అది నా పిల్లలకు వారసత్వం కాకూడదు.

మీ ఏషియన్ గర్ల్స్‌ని చేసుకుంటే విడాకుల ప్రసక్తే వుండదని చెప్పాను గుర్తుందా? మీది భర్తకి అనుగుణంగా మసలుకునే మనస్థత్వం. 'టైమ్స్'లో ఓ ఆర్టికల్‌లో ఇది వచ్చింది.

డార్లింగ్. ఐ లవ్ యు, ఐ నీడ్ యు, ఐ వాంట్ యు. నీ జవాబు కోసం ఎదురుచూస్తున్నాను.

మళ్ళీ నీతో కలిసి బిగ్ మేక్ తినే సమయం కోసం ఎదురుచూస్తున్నాను.

తియ్యటి ముద్దుతో...

**ఎప్పటికీ నీ స్టేన్లీ."**

ఉయ్యాల బల్లమీద కూర్చుని ఆ ఉత్తరం చదువుతున్న వాణికాళ్ళతో నేలని తాటిస్తూ నెమ్మదిగా ఊగుతోంది.

ఉత్తరం మొత్తం చదివాక చిన్నగా నవ్వింది. ఉత్తరానికి జతచేసిన స్టేన్లీ ఫోటోని చూసింది.

పదిహేడేళ్ళవాడిలా కనిపిస్తాడు కానీ నిజానికి అతని వయస్సు ఇరవై. బంగారు జుట్టు, జీన్స్ పేంట్స్, టీ షర్టు, దానిమీద 'ఐ లవ్ న్యూయార్క్' అన్న అక్షరాలు. 'లవ్' అన్న చోట హృదయం ఆకారంలో బొమ్మ వుంది. 'న్యూయార్క్' అన్నచోట స్టేచ్యూ ఆఫ్ లిబర్టీ బొమ్మ వుంది.

'స్పిరిట్ ఆఫ్ ది రివర్' పడవమీద నిలబడి తీయించుకున్న ఫొటో అది.

వెనుక నీళ్ళు.

మిసిసిపి నది పక్కనే ఓ రైల్వే బ్రిడ్జి.

ఈడ్స్ బ్రిడ్జి అది.

ఒక్కసారిగా వాణికి దిగులు కమ్ముకుంది. అమెరికాకు వలస వెళ్ళినవారికి గోదావరి లేదా కృష్ణానది ఫోటోని చూస్తే ఒక్కసారిగా ఇండియా మీద ఎలా బెంగ కలుగుతుందో, అలా చిన్నప్పటినుంచి అక్కడ పెరిగిన వాణికి మిసిసిపి నది, ఈడ్స్ బ్రిడ్జి ఫోటో చూడగానే అమెరికా మీద దిగులు కలిగింది.

వాణి కళ్ళు కొద్ది క్షణాలు వర్షించాయి. టపటప కన్నీళ్ళు స్టేన్లీ ఫోటో మీద పడ్డాయి.

వెంటనే తేరుకుంది.

కళ్ళు తుడుచుకుని ఉత్తరాన్ని, ఫోటోని, కిందపడ్డ కవరు అందుకుని తెరచి అందులో ఉంచింది.

తన తల్లి, తండ్రి, తమ్ముడు, అక్క గుర్తుకొచ్చారు.

'ఐ మిస్ యు ఆల్' మనసులో అనుకుంది.

లోపలికెళ్ళి గోడకున్న చెక్క తలుపులని తెరచింది. అల్మారాలో నిలువుగా పేర్చి వున్న పుస్తకాల్లోంచి ఓ పుస్తకం తీసుకుంది. దాని బ్రౌన్ కలర్ అట్టకున్న స్టేపిల్ పిన్స్‌ని తొలగించి, ఆ కవరుని అట్ట కింద వుంచి మళ్ళీ అట్ట వేసింది.

తర్వాత ఇదివరకటిలా స్టేపిల్ చేసింది. అట్ట లోపల భాగం రైట్ టిక్కు పెట్టింది. ఆ పుస్తకం అట్టలో రెండువైపులా రెండు లెటర్సు ఉన్నాయని గుర్తు. అలాంటి గుర్తులు ఆ అలమారులోని కొన్ని పుస్తకాలకు ఉన్నాయి.

స్టేన్లీ రాసిన లెటర్సు వాటిలో రహస్యంగా ఉంచింది వాణి.

వాణిని అమెరికా నుంచి ఇండియాకి పంపించాలని ఆమె తండ్రి నిర్ణయించుకోడానికి కారణం స్టేన్లీనే.

స్టేన్లీ బ్రాడ్‌బరి వాణి మ్యూజిక్ మేష్టర్ తమ్ముడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**